ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
మంగళవారం 18 ఫిబ్రవరి 2025



ప్రజల ముఖ్యమంత్రి

- మన సీఎంకు ప్రజాభిమానం మెండు
- అభిమాన సీఎంల జాబితాలో స్టాలిన్‌కు ద్వితీయస్థానం

57 శాతానికి పెరిగిన ఆదరణ

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రజాభిమానం అధికంగా కలిగిన ముఖ్యమంత్రుల్లో ఎంకే స్టాలిన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు ప్రముఖ ఆంగ్ల పత్రిక ఇండియా టుడే గ్రూపు నిర్వహించిన సర్వే ఫలితాల్లో వెల్లడైంది. ప్రతి యేటా స్టాలిన్‌కు ప్రజాభిమానం పెరుగుతూనే ఉందని, గత యేడాది ప్రజాదరణ 37 శాతం ఉండగా, ఈ యేడాది 57 శాతానికి పెరిగిందని ఆ సర్వేలో ప్రకటించారు. ఏడాది పాటు డీఎంకే పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, ప్రతిపక్షాల నుండి ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పారిశ్రామిక పెట్టుబడుల పెంపు, మహిళలకు ఉపాధి అవకాశాలు, యువకులకు ప్రోత్సాహకాలు, ప్రతిభాపాటవాల పెంపునకు సంబంధించి ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థల ద్వారా శిక్షణా కార్యక్రమాలు అందించి నిరుద్యోగ సమస్యను కూడా తగ్గించారని ఆ సర్వేలో స్టాలిన్‌ను ప్రశంసించారు.



తూత్తుకుడి పర్యటనలో సాధారణ పౌరులతో సీఎం

పర్యటనల్లో ఉత్సాహం...

ముఖ్యమంత్రిగా ప్రభుత్వ కార్యక్రమాల్లో, పార్టీ అధ్యక్షుడిగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లే స్టాలిన్‌కు ఆయా ప్రాంతాల్లోని ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ముఖ్యంగా యువత ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడుతున్నారని సర్వేలో పేర్కొంది. వృద్ధులు సైతం ఆయనతో కరచాలనం చేయడానికి పోటీపడుతుండటం పరిశీలిస్తే రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతున్నట్టు స్పష్టమవుతోందని వెల్లడించింది. ఇటీవలి కాలంలో విద్యా సంబంధిత పథకాలు కూడా సత్ఫలితాలిస్తుండటంతో స్టాలిన్‌ను యువతీయువకులు 'అప్పా' (నాన్నా) అని సంబోధించడం కూడా వెల్లువెత్తుతున్న ప్రజాదరణకు నిదర్శనమని ఆ సర్వేలో ప్రకటించారు.

విద్యతో రాజకీయం వద్దు

- మాతృభాషలో చదువుకోనివ్వండి
- లింగ్విస్టిక్ మైనారిటీస్ ఫోరం ఆఫ్ తమిళనాడు

ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యతో రాజకీయం చేయకుండా రాజ్యాంగంలోని నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్రంలో ఉన్న తెలుగు, మలయాళం, కన్నడం, ఉర్దూ తదితర మైనార్టీ భాషల విద్యార్థులు వారి వారి మాతృభాషల్లోనే చదువుకొనేందుకు అవకాశం కల్పించాలని లింగ్విస్టిక్ మైనారిటీస్ ఫోరం ఆఫ్ తమిళనాడు (లిమ్‌ఫోట్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు లిమ్‌ఫోట్ ఛైర్మెన్ ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు భాషా విధానాన్ని పరిశీలించామని, దేశంలో 1968వ సంవత్సరం ముందు వరకు అన్ని రాష్ట్రాలు త్రిభాషా సూత్రాన్ని అవలంభించాయని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత తమ ప్రభుత్వంలో మైనారిటీ భాషలకు ఎలాంటి భంగం కలిగించలేదని గుర్తు చేశారు. 2006లో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం ద్విభాషా పథకాన్ని తప్పనిసరి చేసిందని, దీనిని వ్యతిరేకిస్తూ లిమ్‌ఫోట్, స్టేట్ అపెక్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ముస్లిమ్స్ సంస్థల తరఫున మద్రాసు హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. న్యాయస్థానం తమ వాదనతో ఏకీభవించిందని అయితే, శాశ్వత ఉపశమనం ఇవ్వలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో, 2023 సెప్టెంబరులో సుప్రీంకోర్టు మాతృభాష నేర్చుకొనేందుకు భారత రాజ్యాంగ హక్కును సమర్థించి పాఠశాల సిలబస్‌లో మైనారిటీ భాష తప్పనిసరి సబ్జెక్ట్‌గా చేర్చిందని, ఉత్తీర్ణతకు కనీసం మార్కులు సూచించాల్సిందిగా తమిళనాడు ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిందన్నారు. రాష్ట్ర జనాభా మొత్తంలో 40 శాతం మంది భాషాపరమైన మైనారిటీలున్నారని, రాష్ట్రంలో రాజకీయ నాయకులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌తో త్రిభాషా విధానం అనుసరిస్తున్నారని తెలిపారు. 2020 నాటి జాతీయ విద్యా విధానంలో ఎక్కడా హిందీ, సంస్కృతం, ఏదైనా భాష తప్పనిసరి అని చెప్పలేదని, ప్రతి రాష్ట్రంలో మూడు భాషలుండాలని, అందులో కనీసం రెండు భారతీయ భాషలు ఇంగ్లీషుకు అనుగుణంగా ఉండాలని మాత్రమే చెప్పిందని ఆయన వివరించారు. బోధనా మాధ్యమం తల్లిదండ్రుల ఎంపికగా ఉండాలని, రాష్ట్రాలకు, వారిష్టానికి వ్యతిరేకంగా హక్కు లేదని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో స్పష్టం చేసిందన్నారు. తమిళనాడుకు చెందిన నాయకులు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో వృత్తి రీత్యా స్థిరపడి తమ పిల్లలు తమ మాతృభాషలో చదువుకోవాలని కోరుకుంటున్నారనిఅయితే, ఒక్క తమిళనాడు ప్రభుత్వం మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. వాస్తవానికి మైనారిటీ భాషలకు చెందిన తాము తమిళం నేర్చుకోవడానికి వ్యతిరేకం కాదని, అయితే తమ మాతృభాషను సిలబస్‌లో తప్పనిసరిగా చేర్చాలని కోరుకుంటున్నామని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ అభ్యర్థన పరిశీలించి మంచి నిర్ణయం తీసుకోవాలని సీఎంకే రెడ్డి కోరారు.



ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి



గోపాలపురంలో నిర్మిస్తున్న బాక్సింగ్ మైదానం పనులను ఉప ముఖ్యమంత్రి, ఎంపీలకు వివరిస్తున్న రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథ రెడ్డి

త్రిభాషా విధానం పేరుతో హిందీ నిర్బంధమా?

- డీఎంకే, మిత్రపక్షాల నేతల ఆగ్రహం
- నేడు చెన్నై కలెక్టరేట్ ఎదుట ధర్నా

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేయకపోవడం వల్లే సమగ్ర శిక్షా అభియాన్ పథకం నిధులు విడుదల చేయడం లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన ప్రకటన బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు నిదర్శనమని డీఎంకే మిత్రపక్షాల నేతలు ధ్వజమెత్తారు. ఈ మేరకు టీఎన్‌సీసీ నేత సెల్వపెరుందగై, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ వేర్వేరు ప్రకటనలు చేశారు. ఈ నేపథ్యంలో నిధులు విడుదల చేయకుండా త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేయడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ చెన్నై కలెక్టరేట్ ఎదుట మంగళవారం భారీ యెత్తున ధర్నాలు నిర్వహించనున్నట్లు డీఎంకే, దాని మిత్రపక్షాల నాయకులు సంయుక్తంగా ప్రకటించారు. డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, టీఎన్‌సీసీ నేత సెల్వపెరుందగై, సీపీఎం నేత షణ్ముగం, సీపీఐ నేత ముత్తరసన్, ఎండీఎంకే నేత వైగో, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, తమిళగ వాళ్వురిమై కట్చి నేత వేల్‌మురుగన్, మనిదనేయ మక్కల్ కట్చి నేత ఎంహెచ్ జవాహిరుల్లా ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ నేత కేఎం ఖాదర్‌మొయుద్దీన్, మక్కల్ నీదిమయ్యం నేత అరుణాచలం, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి నేత ఈశ్వరన్ ఆ ప్రకటనపై సంతకాలు చేశారు. విద్యాశాఖ మంత్రి కాశీ తమిళ్ సంగమం సభలో తమిళ ప్రజలపై దొడ్డిదారిన నిర్బంధ హిందీ అమలు చేసేలా త్రిభాషా విద్యావిధానం అమలు చేస్తేనే నిధులు విడుదల చేస్తామని ప్రకటించడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఫాసిస్టు ధోరణికి నిదర్శనమని నేతలు విమర్శించారు. మంగళవారం సాయంత్రం చెన్నై కలెక్టరేట్ ఎదుట జరుగనున్న నిరసన ప్రదర్శనలో డీఎంకే, దాని మిత్రపక్షాలకు చెందిన నేతలు, ప్రముఖులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ద్విభాషా విధానానికే కట్టుబడి ఉన్నాం

- డిప్యూటీ సీఎం ఉదయనిధి

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నూతన విద్యావిధానాన్ని, త్రిభాషా విధానాన్ని రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసే ప్రసక్తే లేదని, ద్విభాషా విధానానికే కట్టుబడి ఉన్నామని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తేల్చిచెప్పారు. ట్రిప్లికేన్ ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న మినీ స్టేడియం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేయకపోవడం వల్లే సమగ్రశిక్షా అభియాన్ పథకం నిధులు విడుదల చేయడం లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించడం గర్హనీయమని, ఉన్నతమైన పదవిలో ఉంటూ ఇలా బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడటం తగదన్నారు. విద్యకే కాదు, వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు విడుదల చేయలేదని, ఓ రాష్ట్రానికి నిధులు విడుదల చేయటం కుదరదని చెప్పటం భావ్యం కాదన్నారు. డీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై హయాం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రంలో ద్విభాషా విద్యావిధానమే ఉందని, ఇకపై కూడా అదే విధానం కొనసాగితీరుతుందని ఉదయనిధి స్పష్టం చేశారు. కేంద్రం త్రిభాషా విధానాన్ని దొడ్డిదారిన అమలు చేయడానికి, ఆ సాకుతో నిర్బంధ హిందీ రుద్దడానికి ప్రయత్నించినా అడ్డుకుంటామని హెచ్చరించారు. తమిళ మాధ్యమంలో చదివిన వారంతా ప్రస్తుతం సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లుగా ఉన్నత పదవుల్లో ఉన్నారని స్పష్టం చేశారు. కేంద్రం నిధులు విడుదల చేయకుండా, నూతన విద్యావిధానాన్ని, త్రిభాషా విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తే తమిళ ప్రజలు చూస్తూ ఊరుకోరని, కేంద్రంపై తిరగబడటం ఖాయమని ఆయన అన్నారు.

సీబీఐకి ధాతు ఇసుక అక్రమ రవాణా కేసు

- మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు

అడయార్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాల నుంచి చట్టవ్యతిరేకంగా చేసిన ధాతు ఇసుక అక్రమ రవాణా కేసును సీబీఐకి మద్రాస్ హైకోర్టు బదిలీ చేస్తూ సోమవారం సంచలన తీర్పు చెప్పింది. అలాగే, ఆదాయపన్ను శాఖ (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేయాలని, ఈ కేసులోని అన్ని రికార్డులతో పాటు కేసు పూర్తి వివరాలను సీబీఐకి నాలుగు వారాల్లో రాష్ట్ర పోలీసులు అందజేయాలని ఆదేశించింది. అలాగే, ఈ కేసులో ధాతు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన ప్రైవేట్ కంపెనీల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అపరాధ రుసుం వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. సముద్రతీర ప్రాంతాల్లో ధాతు ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని, దీని కారణంగా రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం ఏర్పడిందంటూ విక్టర్ రాజమాణిక్యం అనే వ్యక్తి మద్రాస్ హైకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునెల్వేలి జిల్లాల్లోని సముద్రతీర ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే ధాతు ఇసుకను అక్రమంగా తరలించారన్నారు. అలాగే, మద్రాస్ హైకోర్టు కూడా ఇదే కేసును సుమోటాగా స్వీకరించిన విచారణ చేపట్టింది. ఈ కేసులో రాష్ట్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఒక కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. ధాతు ఇసుక తవ్వకాల కోసం వీవీ మినరల్స్, ట్రాన్స్‌వరల్డ్ కార్నెట్ పాటు మొత్తం ఏడు కంపెనీలకు, నెల్లై జిల్లాలో 52, తూత్తుకుడి జిల్లాలో ఆరు, కన్నియాకుమారి జిల్లలో ఆరు చొప్పున మొత్తం 64 అనుమతులు మంజూరు చేసిందన్నారు. అయితే, ప్రభుత్వం అనుమతించిన దానికంటే ఎక్కువగా ధాతు ఇసుక అక్రమ రవాణా చేసారనే ఆరోపణల నేపథ్యంలో ఈ అనుమతులన్నీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ధాతు ఇసుక తవ్వకాలు, రవాణాపై నిషేధం విధించక ముందు, నిషేధం విధించిన తర్వాత మొత్తం రూ.5,832 కోట్ల 44 లక్షల మేర నష్టం వాటిల్లిందన్నారు. ఈ మొత్తాన్ని ధాతు ఇసుక ఎగుమతిదారుల నుంచి వసూలు చేశామని, అలాగే, ప్రైవేటు మినరల్స్ కంపెనీల వద్ద ఉన్న 1.55 కోట్ల టన్నుల ధాతు ఇసుకను స్వాధీనం చేసుకుమాన్నమన్నారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ల సారథ్యంలో ఏర్పాటు చేసిన కమిటీ 2018 నుంచి 2022 మధ్యకాలంలో 16 లక్షల టన్నుల ధాతు ఇసుక అక్రమంగా తరలించినట్టు నిర్ధారించిందన్నారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తరఫున కూడా ఒక కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. అణు విద్యుత్ ఉత్పత్తిలో మోనోసైట్ అనే ధాతువు ఎంతో ముఖ్యమైనదని, వీటి తవ్వకాలు, రవాణాకు కేంద్ర ప్రభుత్వం అనుమతులివ్వలేదని కోర్టుకు తెలిపారు. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఎం సుబ్రహ్మణ్యం, జస్టిస్ ఎం.జ్యోతి రామన్‌లతో కూడిన ధర్మాసనం కీలక తీర్పునిచ్చింది. కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునెల్వేలి జిల్లాల్లో ధాతు ఇసుక అక్రమ రవాణా జరిగినట్టు నిర్ధారణ అయిందన్నారు. అలాగే, ప్రైవేట్ మినరల్స్ కంపెనీ నుంచి ప్రభుత్వం అపరాధం వసూలు చేయడం సబబేనని స్పష్టం చేసింది. ఈ ఇసుక అక్రమ రవాణాపై లోతుగా విచారణ జరిపేందుకు కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్టు స్పష్టం చేసింది. ప్రైవేట్ మినరల్స్ ఎక్స్‌పోర్ట్ కంపెనీల ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఈడీ, ఐటీ శాఖలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలని ధర్మాసనం పేర్కొంది.



నవరస నటనా పటిమకు చిరునామా సూర్యకాంతం

- విశ్రాంతాచార్యులు సత్యవాణి




అతిథులకు సత్కారం

అడయార్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నవరసాలను తన హావభావాలతో ప్రదర్శించి, ప్రేక్షకులను మెప్పించిన మేటి నటి దివంగత సూర్యకాంతం అని కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు డాక్టర్ జేవీ సత్యవాణి పేర్కొన్నారు. పట్టాభిరాంలోని ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కాలేజీ తెలుగు శాఖ, తెలుగు భాషా సమితి, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి - యువ సంయుక్తంగా సోమవారం 'సూర్యకాంతం నటనా వైదుష్యంలో నవరసాలు' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సును రెండు దశల్లో నిర్వహించాయి. ఈ సదస్సు ప్రారంభోపన్యాసంలో సూర్యకాంతం వివిధ చిత్రాల్లో ఘట్టాలను ఉదహరిస్తూ జేవీ సత్యవాణి విశ్లేషించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యకాంతం తనయుడు డాక్టర్ అనంతపద్మనాభ మూర్తి వారి అమ్మ ప్రేమను గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత జరిగిన తొలి సదస్సులో ట్రిబ్యునల్ జడ్జి జయచంద్ర మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తన సినిమాల్లో ఎక్కువగా సూర్యకాంతం ప్రాముఖ్యత ఇచ్చారన్నారు. ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారుడు మాధవపెద్ది మూర్తి మాట్లాడుతూ, నాట్యంలో రసపోషణ సులభంగా చేయవచ్చుని, కానీ సినిమాల్లో కెమెరాముందు నవరసాలను పండించడం ఆషామాషీ కాదన్నారు. అయితే, సూర్యకాంతంకు ఇది వెన్నతో పెట్టిన విద్య అని కొనియాడారు. ప్రముఖ రచయిత చిర్రావూరు మదన్ మోహన్... సూర్యకాంతం నటించిన సినిమాలపై కవితను వినిపించారు. రెండో సమావేశంలో తెర మీద అత్తరికాన్ని ప్రదర్శిస్తూ తెర వెనుక అమ్మదనాన్ని రుచి చూపించిన మేటినటి సూర్యకాంతం అని ప్రముఖ రచయిత్రి జలంధర కొనియాడారు. ప్రముఖ హాస్య రచయిత్రి జోస్యుల ఉమ ఆలపించిన పేరడి పాటలు ఆహూతులను అలరించాయి. ప్రముఖ సినీ నిర్మాత, దక్షిణ భారత చలనచిత్ర నిర్మాతల మండలి మాజీ అధ్యక్షుడు కాట్రగడ్డ ప్రసాద్ మాట్లాడుతూ... సూర్యకాంతంతో సినిమాలు తీసే అదృష్టం దొరకలేదు గానీ, ఆమెతో తనకు పరిచయం ఉందన్నారు. ఆమె కుమారుడు అనంతపద్మనాభ మూర్తి తల్లి రుణాన్ని ఏదో రూపంలో తీర్చుకుంటూనే ఉన్నారన్నారు. సూర్యకాంతం శతజయంతి ప్రారంభవేడుకలు తన ఆధ్వర్యంలోనే జరగడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఇదిలా వుండగా విద్యార్థులు శబ్దచిత్ర ప్రదర్శనతో చక్కటి ప్రతిభ కనబరిచారు. దీన్ని రూపొందించిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించి, జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా కార్యదర్శి ఎం.వెంకటేశ పెరుమాళ్ అతిథులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. సమాపన సభలో అతిథులు రోజా రమణి, కాట్రగడ్డను నిర్వాహకులు సన్మానించారు. డాక్టర్ తుమ్మపూడి కల్పన నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.కల్విక్కరసి, సంచాలకుడు డాక్టర్ ఎన్.రాజేంద్ర నాయుడు, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సురేష్, సహాయాచార్యులు డాక్టర్ డి.ప్రమీల, పూర్వవిద్యార్థులు, నగరానికి సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.



సూర్యకాంతం తనయుడు అనంతపద్మనాభ మూర్తికి సన్మానం

వైభవంగా పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులో టీటీడీ నిర్వహణలోని పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఉదయం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి పుణ్యాహవచనం, విశ్వక్సేనారాధన, అంకురార్పణ కార్యక్రమాన్ని అర్చక స్వాములు జరిపారు. ఈ నెల 26వ తేది వరకు జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఉదయం 8 నుంచి జరిగిన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. విశేషంగా అలంకరించిన అమ్మవారిని చిన్న శేష వాహనంపై ఉంచి భక్తుల దర్శనానికి అనుమతించారు. సాయంత్రం 5 నుంచి జరిగిన ఊంజల్ సేవలో టీటీడీ చెన్నై సలహా మండలి మాజీ నిర్వాహకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సర్వాలంకరణలో పద్మావతి అమ్మవారు



అమ్మవారి ఆలయంలో ధ్వజారోహణం

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా అంబత్తూర్ పరిధిలోని పుదూర్, విజయలక్ష్మి పురం, కారుక్కు, డీటీపీ కాలనీ, టీఎన్ఈబీ కాలనీ, భాను నగర్, వెస్ట్ బాలాజి నగర్, రెడ్‌హిల్స్ రోడ్డు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

'హరిత ప్రేమికులు' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులవుతున్న వ్యక్తులు, సంస్థలను ప్రోత్సహించేలా 2021వ సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం 'హరిత ప్రేమికులు' పేరిట పురస్కారం అందిస్తోంది. పురస్కారగ్రహీతలకు రూ.లక్ష అందజేస్తోంది. 2024-25వ సంవత్సరానికి వ్యక్తులు, సంస్థలకు మొత్తం వంద పురస్కారాలు అందజేయనుంది. ఆసక్తి కలిగిన వారు తాము చేసిన, చేస్తున్న పర్యావరణ కార్యక్రమాలతో పాటు ఏప్రిల్ 15వ తేదిలోపు www.tnpcb.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ జాక్డే ఒక ప్రకటనలో తెలిపారు.

ఫార్మాసిస్ట్ పోస్టులకు ....

ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 425 ఫార్మాసిస్ట్ పోస్టులకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు (ఎమ్మార్బీ) ద్వారా భర్తీకానున్న ఈ పోస్టులకు అర్హత కలిగిన వారు మార్చి 10వ తేదిలోపు mrb.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. దరఖాస్తు రుసుముగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు రూ.500, ఇతరులు రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. వివరాలకు ఎమ్మార్బీ వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

వైద్య విభాగంలో ఉద్యోగాలకు....

తిరువళ్లూర్ జిల్లా హెల్త్ సొసైటీ ద్వారా డెంటిస్ట్, డేటా ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్ సహా పలు పోస్టులకు కాంట్రాక్ట్ విధానంలో భర్తీచేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు https://tiruvallur. nic.in అనే వెబ్‌సైట్ నుండి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దరకాస్తు పూర్తిచేసి స్వీయ వివరాలతో కూడిన సర్టిఫికెట్లు జత చేసి 'నిర్వహణ కార్యదర్శి, జిల్లా హెల్త్ సొసైటీ, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి, తిరువళ్లూర్' అనే చిరునామాలో నేరుగాను, పోస్టు ద్వారా ఈ నెల 28వ తేదిలోపు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతాప్ ప్రకటన విడుదల చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏఐసీటీఈ యాశస్వి, సరస్వతి తదితర పథకాలద్వారా ఇంజనీరింగ్,డిప్లొమో విద్యార్థులకు ఉపకారవేతనం అందిస్తోంది. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాలల్లో మెకానికల్, సివిల్ తదితర కోర్సుల్లో చేరాలనుకొనే అర్హులైన విద్యార్థులకు 'యశస్వి'పథకంలో ప్రతిఏడాది రూ.50వేలు స్కాలర్ షిప్ అందజేస్తోంది. అలాగే, సాంకేతిక విద్య అభ్యసించాలనుకొనే విద్యార్థినులకు 'సరస్వతి' పథకం కింద ఏడాదికి రూ.25 వేలు విద్యా సహాయంగా అందజేస్తోంది.ఈ ఉపకారవేతనం పొందేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 28వ తేదిలోపు https: //scholarships. gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు https://aicteindia.org/ అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

నెల్లై-తిరుచెందూర్ మధ్య రైల్వేస్టేషన్లలో ఫ్లాట్‌ఫారం ఎత్తు పెంపు

ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి-తిరుచెందూర్ మధ్య ఆరు ప్రధాన రైల్వేస్టేషన్లలో ఫ్లాట్‌ఫారంల ఎత్తు పెంచే పనులు సోమవారం ప్రారంభించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఈ మార్గంలో ఉన్న పాళయంకోట, ఆళ్వార్‌తిరునగర్, కచ్చనావిళై, కురుంబూర్, కాయల్‌పట్టణం ప్రాంతాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 1వ నెంబరు ఫ్లాట్‌ఫారం ఎత్తు పెంచుతున్నారు. సైదుంగ రైల్వేస్టేషన్‌లోని 1,2 ఫ్లాట్‌ఫారాలు, కాయల్‌పట్టణంలోని ఫ్లాట్ ఫారం, డిజిటల్ బోర్డులు, ప్రహరీ గోడ ఎత్తు పెంచే పనులు ప్రారంభమయ్యాయని రైల్వే అధికారులు తెలిపారు.

మహిళల కోసం మరో 174 పింక్ బస్సులు

ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఉచిత ప్రయాణం కోసం 174 పింక్ బస్సులను అదనంగా కేటాయించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆదాయం తక్కువగా ఉన్న ఎక్స్‌ప్రెస్ బస్సులను సిటీ బస్సులుగా మార్పు చేసి మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం అనుమతించిందని చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. తాజాగా నగరంలో పరిచయం చేసిన 'విడియల్ పయనం' బస్సుల్లో ప్రయాణం చేస్తున్న మహిళల సంఖ్య 63 శాతానికి పెరిగిందని ఎంటీసీ అధికారులు తెలిపారు.

8,525 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు అనుమతి

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ డిమాండ్ పూర్తిచేసేలా, బహిరంగ మార్కెట్లో 8,525 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేసేందుకు విద్యుత్ బోర్డుకు తమిళనాడు విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ అనుమతించింది. ఆ ప్రకారం, ఫిబ్రవరి-మే వరకు రాత్రి 12 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ డిమాండ్ పూర్తిచేసేలా 2,750 మెగావాట్లు, పీక్ అవర్స్ అయిన సాయంత్రం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు 5,775 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు అనుమతులు లభించాయని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

యూజీసీ ముసాయిదాను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ధర్నా

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యూజీసీ ముసాయిదా నివేదికను వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. నుంగంబాక్కంలోని శాస్త్రిభవన్ వద్ద ధర్నాలో పాల్గొన్న నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ... ఇటీవల యూజీసీ ముసాయిదా నివేదిక అమలుచేస్తే విద్యా రంగంపై రాష్ట్రాల హక్కులు కోల్పోయే ప్రమాదముందన్నారు. విద్య కాషాయికరణలో భాగంగా బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. విద్యారంగంపై పూర్తి హక్కులు రాష్ట్రాలకే ఉండేలా కేంద్రం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో భాగంగా ముందుగా ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు శాస్త్రిభవన్‌కు ర్యాలీగా బయలుదేరి లోనికి వెళ్లేందుకు యత్నించగా, అక్కడ ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట, వాగ్వివాదం చోటుచేసుకుంది.



శాస్త్రి భవన్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

అన్నాడీఎంకేలో చేరేందుకు ఎవరి సిఫారసు అక్కర్లేదు: ఓపీఎస్

ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేలో చేరేందుకు తనకు ఎవరి సిఫారసు అక్కర్లేదని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం పేర్కొన్నారు. మదురై విమానాశ్రయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే అభివృద్ధికి తాను చేసిన కృషిని గుర్తించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత పలుమార్లు పొగడ్తలతో ముంచెత్తారని తెలిపారు. వివిధ కారణాల వల్ల చీలిపోయిన అన్నాడీఎంకే శక్తులన్నీ ఒకటై పార్టీకి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలన్నదే తన కోరిక అన్నారు. పార్టీకి దూరంగా ఉన్న తనను మళ్లీ అన్నాడీఎంకేలో చేర్చేందుకు సిఫారసు చేస్తామని ఎమ్మెల్యే రాజన్‌చెల్లప్ప అన్నారని, అలాంటి సిఫారసు తనకు అక్కర్లేదన్నారు. అందరు ఐకమత్యంతో చేరితేనే రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రమే కాకుండా భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో కూడా అన్నాడీఎంకే ఘనవిజయం సాధిస్తుందని ఓపీఎస్ తెలిపారు.

మంత్రి దురైమురుగన్‌కు అస్వస్థత

● అపోలో ఆస్పత్రిలో చికిత్స



చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర నీటి వనరుల శాఖ మంత్రి దురైమురుగన్ సోమవారం వేకువజాము తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొరట్టూరు ప్రాంతంలో నివాసంలో ఉన్న దురైమురుగన్‌కు ఉన్నట్టుండి జ్వరం, జలుబు అధికమైంది. వెంటనే ఆయనను కుటుంబీకులు చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రిలో చేర్చారు. జలుబు, జ్వరం ఎక్కువగా ఉండటంతో దురైమురుగన్‌కు చికిత్స అందిస్తున్నట్లు అపోలో ఆసుపత్రి వైద్యనిపుణులు తెలిపారు. ఈ విషయం తెలియగానే ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అపోలో ఆస్పత్రికి వెళ్ళి దురైమురుగన్‌ను పరామర్శించారు. ఆయనకు అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

రైతుల నుంచి లంచం అడగొద్దు

మార్కెటింగ్ కేంద్రాలకు ప్రభుత్వం హెచ్చరిక

ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద లంచం డిమాండ్ చేస్తే చట్టపరమైన చర్యలుంటాయని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు సచివాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రవ్యాప్తంగా రైతుల సంక్షేమార్థం 2,600లకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలకు ప్రతిరోజు సుమారు 12,800 మంది రైతులు సుమారు 60వేల టన్నుల ధాన్యం సరఫరా చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన నగదు రైతుల బ్యాంక్ ఖాతాల్లో ఆన్‌లైన్ ద్వారా జమ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, కొన్ని కేంద్రాల్లో రైతుల నుంచి లంచం డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, పౌరసరఫరాల శాఖ దీనిని అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ఆ మేరకు రాజధాని నగరం చెన్నైలోని ప్రధాన కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా 18005993540 అనే టోల్ ఫ్రీ నెంబరు, తమిళనాడు పౌరసరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌కు 9445257000 అనే వాట్సాప్ నెంబరు ద్వారా తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

హోటల్ మేనేజ్‌మెంట్ దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న 78 కళాశాలల్లో హోటల్ మేనేజ్‌మెంట్ యాజీ కోర్సుల్లో చేరేందుకు జాతీయస్థాయిలో నిర్వహించే జేఈఈలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. 2025-26వ విద్యా సంవత్సరానికి సంబంధించి జేఈఈ పరీక్ష ఏప్రిల్ 27వ తేది జరుగనుంది. దీనికి దరఖాస్తు గడువు డిసెంబరు 16 నుంచి ఈ నెల 15వ తేదీతో ముగిసింది. విద్యార్థుల అభ్యర్థన మేరకు దరఖాస్తు చేసేందుకు ఈ నెల 28వ తేది వరకు గడువు పొడిగించారు. మరిన్ని వివరాలకు 011-40759000/69227700 అనే నెంబర్లలో సంప్రదించవచ్చని జాతీయ పరీక్ష ఏజెన్సీ (ఎన్టీఏ) ఒక ప్రకటనలో తెలిపింది.

ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే



ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు సౌత్ యూనియన్ కొత్త కండిగై గ్రామంలో రూ.18.42 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను సోమవారం తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ ప్రారంభించారు.యూనియన్ కార్యదర్శి రవీంద్రన్, నిర్వాహకులు గోపి, గవాస్కర్, రవి, భాస్కర్, సత్యమూర్తి, కుమార్, అంబేడ్కర్, విద్యాసాగర్, ప్రభు, శివానంద, సంజీవి, సునీల్, ఏకాంబరం, అధికారులు పాల్గొన్నారు.

సీమాన్‌కు రాణిపేట, ఈరోడ్ పోలీసుల సమన్లు

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ కీర్తి ప్రతిష్టతలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్‌కు రాణిపేట, ఈరోడ్ పోలీసులు సమన్లు పంపించారు. రాణిపేట పోలీసులువీలైనంత త్వరగా తమ స్టేషన్లలో విచారణకు హాజరు కావాలని, ఈరోడ్ కరుంగల్‌పాళయం పోలీసులు ఈ నెల 20న జరిగే విచారణకు రావాలని ఆ సమన్‌లలో పేర్కొన్నారు.

నీలగిరి జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం

● వాహనాలను తనిఖీ చేసిన కలెక్టర్



వాహనాలు తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మి భవ్య

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నిషేధించిన ప్లాస్టిక్‌కు సంబంధించి పోలీస్ చెక్‌పోస్ట్‌లో జిల్లా కలెక్టర్ స్వయంగా వాహన తనిఖీలు చేపట్టారు. నీలగిరి జిల్లా వస్తున్న పర్యాటకులు ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులు తీసుకురాకూడదంటూ నిషేధం విధించడంతో పాటు తనిఖీలు చేపట్టి వాటిని స్వాధీనం చేసుకోవాలని మద్రాసు హైకోర్టు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులతో జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో వస్తున్న పర్యాటకుల నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం నీలగిరికి అధిక వాహనాల్లో పర్యాటకులు వచ్చారు. జిల్లా సరిహద్దులోని పోలీసు చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన కలెక్టర్ లక్ష్మి భవ్య వాహనాలను స్వయంగా పరిశీలించారు.

శ్రీలంక దాడులకు నిరసనగా రైల్‌రోకో

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం రాష్ట్ర జాలర్లపై చేస్తున్న దాడులను నిరసిస్తూ కారైక్కాల్‌లో జాలర్ల కుటుంబాలు రైల్ రోకో చేపట్టాయి. రాష్ట్రం నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్తున్న జాలర్లు, సరిహద్దులు దాటారంటూ శ్రీలంక నావికాదళం వారిని అరెస్ట్ చేయడంతో పాటు పడవలు స్వాధీనం చేసుకుంటోంది. ఇటీవల కాలంలో లంక నావికాదళం దాడులు అధికమయ్యాయి. అరెస్ట్ చేసిన జాలర్లను కోర్టులో హాజరుపరచగా, భారీ జరిమానా విధిస్తుండడంతో జాలర్లలో ఆందోళన నెలకొంది. లంక నావికాదళం దాడులు అడ్డుకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ కారైక్కాల్ జాలర్ల సంఘం ఆధ్వర్యంలో రైల్ రోకో చేపట్టారు. రైలు పట్టాలపై పడుకున్న జాలర్ల మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి సమీపంలోని కల్యాణ మండపానికి తరలించారు.



రైలు పట్టాలపై పడుకున్న మహిళలు

డిమాండ్లు పరిష్కరించాలని పవర్‌లూమ్స్ కార్మికుల సమ్మె

తిరుత్తణి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కనీస వేతన చట్టం అమలు, వేతన పెంపు సహా పలు డిమాండ్లతో పవర్‌లూమ్స్ కార్మికులు సమ్మెబాట పట్టారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి నియోజకవర్గ పరిధిలోని పొదటూరుపేట, బీఆర్ పల్లి, అమ్మయార్‌కుప్పం, వంగనూరు, అతిమాంజేరిపేట సహా 11 ప్రాంతాల్లో సుమారు 30వేలలకు పైగా పవర్ లూమ్స్ కేంద్రాల్లో 1.50 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరు వేతన పెంపు, పనిగంటలకు సమానంగా వేతనం కోరుతూ దీర్ఘకాలంగా ఆందోళనలు చేస్తున్నా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో, అరింజర్ అన్నా వీవర్స్ ప్రోగ్రెస్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాది కలా విజయన్ నేతృత్వంలో సోమవారం కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్నారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.



పాముకాటుకు గురై సుదీర్ఘ చికిత్స తర్వాత కోలుకున్న చిన్నారి



డాక్టర్ సమక్షంలో బర్త్‌డే చేసుకుంటున్న చిన్నారి ధనశ్రీ

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా ఓక్కూరు అన్నానగర్ ప్రాంతానికి చెందిన సన్నబాబు, దివ్య దంపతుల కుమార్తె ధనశ్రీ (4) అనే చిన్నారి పాముకాటుకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో సుదీర్ఘ చికిత్స తర్వాత కోలుకుంది. వైద్యుల మెరుగైన వైద్యం చేయడంతో కోలుకున్న ఆ బాలిక వైద్యులకు ధన్యవాదాలు తెలియజేసింది. ధనశ్రీని జనవరి 16న పాము కాటువేసింది. వెంటనే ఆమెను శివగంగ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స విభాగంలో చేర్చి ఆ చిన్నారికి చికిత్సలందిస్తుండగా పాము విషం నాడీ మండలాన్ని దెబ్బతీసింది. వెంటనే వైద్యులు ఆమె శ్వాసనాళానికి రంధ్రం వేసి కృత్రిమ శ్వాస కల్పించారు. రోజూ 24 గంటలపాటు వైద్యులు ఆమెకు చికిత్సలందిస్తూ వచ్చారు. చివరకు ఈ నెల 14న ఆ చిన్నారి సంపూర్ణంగా కోలుకుంది. దీనితో ఆ ఆసుపత్రి ప్రాంగణంలోనే ధనశ్రీ బర్త్‌డే వేడులకు జరిపి ఆమె తల్లిదండ్రులు వైద్యనిపుణులు శివకుమార్, బాలసుబ్రమణ్యం, వనితా, వేల్‌మురుగన్, నాగ సుబ్రమణియన్, విజయబాబు, నర్సులకు ధన్యవాదాలు తెలుపుకున్నారు.

అన్నాడీఎంకే జిల్లా ఇన్‌ఛార్జీల జాబితా విడుదల

● సీనియర్ నేత సెంగోట్టయన్ పేరు మిస్సింగ్

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే జిల్లా ఇన్‌ఛార్జీల జాబితా సోమవారం విడుదల కాగా, పార్టీ సీనియర్ నేత సెంగోట్టయన్ పేరు జాబితాలో లేకపోవడం చర్చనీయాంశమైంది. 2026 అసెంబ్లీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా బూత్ కమిటీల ఏర్పాటు, పార్టీ అనుబంధ సంఘాల సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం తదితర చర్యల కోసం 82 జిల్లా ఇన్‌ఛార్జీలతో కూడిన జాబితాను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సోమవారం విడుదల చేశారు. కొత్తగా నియమితులైన ఇన్‌ఛార్జీలు తమ తమ నియోజకవర్గాల్లో పర్యటించి, తాము పరిశీలించిన విషయాలను మార్చి 31వ తేది లోగా నివేదికగా సమర్పించాలని పళనిస్వామి ఆదేశించారు. అదే సమయంలో కొద్దికాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న సీనియర్ నేత సెంగోట్టయన్ పేరు జాబితాలో లేకపోవడం పార్టీ శ్రేణులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఆయనను పార్టీ ఇతర పదవులను ఎంపిక చేసే అవకాశముండొచ్చని పలువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

టీటీ గ్రూపు - ఏఎఫ్‌సీవోఎంల మధ్య ఒప్పందం

అడయార్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): టీటీ గ్రూపు, ఏఎఫ్‌సీవోఎం కార్గో కంపెనీల మధ్య కీలకమైన ఒప్పందం కుదిరింది. గ్లోబెల్ ఎయిర్ ఫ్రైట్ సేవలను మరింత విస్తరించేలా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా, టీటీ గ్రూపు గ్లోబెల్ జనరల్ సేల్స్ ఏజెంట్ (జీఎస్ఏ)ను కొత్తగా నియమించగా, ఏఎఫ్‌సీవోఎం సొంతంగా ఎయిర్‌క్రాఫ్టలను కొనుగోలు చేయడం, ఫ్రైట్ సర్వీస్ సేవలను మరింతగా విస్తరించనుంది. ఈ రెండు కంపెనీల మధ్య కుదిరిన ఒప్పందం ఫ్రైట్ సర్వీస్ సెక్టార్‌లో ఒక మైలురాయివంటిందని టీటీ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ అరున్ వాసు, ఏఎఫ్‌సీవోఎం హోల్డింగ్స్ లిమిటెడ్ చైర్మన్ కెప్టెన్ దీపక్ పరశురామన్‌లు పేర్కొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

పళని ఆలయం కోసం తాటిబెల్లం తయారీ

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పళని దండాయుధపాణి ఆలయం కోసం గౌంతంబాడి పరిసర ప్రాంతాల రైతులు తాటి బెల్లం తయారు చేస్తున్నారు. పళని ఆలయ నిర్వాహకులు ఈ నెల 20న భారీ స్థాయిలో తాటిబెల్లం కొనేందుకు సన్నాహాలు చేపడుతున్నారు. పళని ఆలయ పంచామృతం కోసం నాణ్యమైన తాటి బెల్లం వినియోగిస్తారు. ఆ మేరకు గౌంతంబాడి రెగ్యులేటరీ మార్కెట్‌లో ప్రతియేటా తాటిబెల్లం టన్నుల కొద్దీ కొనుగోలు చేస్తున్నారు. తైపూసం వేడుకల సందర్భంగా లక్షల సంఖ్యలో పంచామృతం సీసాలను విక్రయించడంతో ఆలయ నిర్వాహకులు వీలైనంత త్వరగా పంచామృతం తయారు చేయాలని నిర్ణయించారు. ఆ ప్రకారం ఈ నెల 20 గౌంతంబాడి పరిసరాల్లో తాటి బెల్లం తయారు చేసే రైతులు నాణ్యమైన పొడి తాటి బెల్లం రెగ్యులేటరీ మార్కెట్ తీసుకురావాలని ఆలయ అధి కారులు ప్రకటించారు. 20వ తేదీ ఉదయం 11 గంటలకు తాటిబెల్లం బస్తాలను తీసుకొ స్తే వాటి నాణ్యతను అప్పటికప్పుడు పరిశీలించి కొనుగోలు చేస్తామని తెలిపారు. మంగళవారం నుంచి తాటిబెల్లం బస్తాలను గౌంతంబాడి మార్కెట్‌కు తరలించవచ్చునన్నారు.



తాటిబెల్లం తయారు చేస్తున్న రైతు

డిప్యూటీ సీఎం ఉదయనిధికి హైకోర్టు నోటీసు

ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) 'ఏంజెల్' సినిమా షూటింగ్ పూర్తిచేయని కారణంగా, రూ.25 కోట్లు నష్టపరిహారం కోరుతూ చిత్ర నిర్మాత దాఖలుచేసిన అప్పీలు కేసులో డిప్యూటీ సీఎం ఉదయనిధి వివరణ కోరుతూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఏంజెల్ చిత్ర నిర్మాత రామశరవణన్ వేసిన పిటిషన్‌లో... ఉదయనిధి హీరోగా కేఎస్ అదియమాన్ దర్శకత్వంలో ఏంజెల్ చిత్రం షూటింగ్ 2018వ సంవత్సరంలో ప్రారంభమైంది. 80 శాతం షూటింగ్ పూర్తయిన నేపథ్యంలో, మిగతా 20 శాతం పూర్తిచేయాల్సిన ఉండగా, ఉదయనిధి 'మామన్నన్' చిత్రంలో నటించి అదే తన చివరి చిత్రంగా ప్రకటించారు. ఏంజెల్ చిత్రంలో నటించేందుకు కాల్‌షీట్ ఇవ్వకుండా ఉదయనిధి నిర్లక్ష్యం చేశారని, ఇప్పటివరకు చిత్ర నిర్మాణానికి రూ.11 కోట్లు ఖర్చు చేశామని, అందువల్ల తమకు నష్టపరిహారంగా రూ.25 కోట్లు ఇవ్వాల్సిందిగా న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేయాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రత్యేక న్యాయమూర్తి, ఏంజెల్ చిత్ర నిర్మాత రామశరవణన్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ రామశరవణన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ సోమవారం న్యాయమూర్తులు అనితా సుమన్, కుమరప్పన్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రాగా, పిటిషనర్‌కు వివరణ ఇవ్వాలని ఉదయనిధికి ఆదేశించారు. తదుపరి విచారణ మార్చి 18వ తేదీకి ధర్మాసనం వాయిదావేసింది.

ముమ్మరంగా ఉప్పు తయారీ



ఉప్పు మళ్లను సిద్ధం చేస్తున్న కార్మికుడు

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో, తూత్తుకుడి జిల్లాలో ఉప్పు ఉత్పత్తి ముమ్మరంగా సాగుతోంది. జిల్లాలో వ్యవసాయం, చేపల వేటతో పాటు ఉప్పు ఉత్పత్తి కూడా చేస్తారు. వర్షాకాలంలో ఉప్పు మళ్లలో చేరే అవకాశముండడంతో ఆ కాలంలో ఉప్పు ఉత్పత్తి నిలిపివేస్తుంటారు. ప్రస్తుతం వేసవి ప్రారంభం కావడంతో ఉప్పు మళ్లను కార్మికులు సిద్ధం చేస్తున్నారు. ఈ విషయమై ఉప్పు ఉత్పత్తి రైతు సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ... జిల్లాలో వేలాది ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ఈ జిల్లా ఉప్పు నాణ్యతగా ఉండడంతో పొరుగు జిల్లాలు, రాష్ట్రాల వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారన్నారు. ఈ ఏడాది సాధారణం కన్నా అధిక విస్తీర్ణంలో ఉప్పు ఉత్పత్తి చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన విద్యుత్ అధికారి

ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి కేకే నగర్ విద్యుత్ బోర్డు కార్యాలయంలో రూ.10 వేలు లంచం పుచ్చుకుంటూ అసిస్టెంట్ ఇంజనీర్ సహా ఇద్దరిని అవినీతి నిరోధక విభాగం అధికారులు పట్టుకున్నారు. కేకే నగర్‌లో ఉన్న విద్యుత్ బోర్డు కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. సుమారు రెండు గంటలకు పైగా తనిఖీలపై అధికారులు మాట్లాడుతూ... తిరుచ్చి కేకే నగర్ ఇందిరా గాంధీ వీధికి చెందిన శ్రీనివాసన్, తన పేరుతో బాడ్మింటన్ కోర్టుకు త్రీ ఫేస్ విద్యుత్ కనెక్షన్ కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని, ఇందుకు ఏఈ చంద్రశేఖర్ రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారని, దీనిపై అందిన ఫిర్యాదు మేరకు తాము మారువేషాల్లో ఆ కార్యాలయంలో నిఘా వేసినట్లు తెలిపారు. విద్యుత్ కనెక్షన్ కోరిన శ్రీనివాసన్, తమ సలహా మేరకు రసాయనాలు పూసిన కరెన్సీని చంద్రశేఖర్‌కు అందిస్తుండగా పట్టుకొని విచారిస్తున్నామన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం

● వృద్ధుడి అరెస్టు

పుదుచ్చేరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కిరుమాంబాక్కంలో 38 యేళ్ల మానసిక రోగిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి ఆమె గర్భం దాల్చడానికి కారకుడైన 65 యేళ్ల వృద్ధుడిని పోలీసులు అరెస్టు చేశారు. జనవరిలో ఆమె అస్వస్థతకు గురికాగా తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఆమె గర్భం దాల్చినట్లు చెప్పటంతో దిగ్భ్రాంతి చెందారు. ఆస్పత్రి నిర్వాహకులు మహిళా పోలీసుస్టేషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మహిళను పోలీసుల సుమారు నెల రోజులపాటు సుదీర్ఘంగా విచారించిన మీదట 65 ఏళ్ల వృద్ధుడు ఆమెపై అత్యాచారాని పాల్పడినట్లు తెలుసకుని అతడిని అరెస్టు చేశారు.

యువతి హత్య కేసులో ఒకరి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పళనిలో ఒక యువతి హత్య కేసులో స్థానికంగా పేరొందిన ఓ స్వామి శిష్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు నుంచి తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించి జారి పడటంతో కాలు విరిగింది. దీంతో నిందితుడిని ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. దిండిగల్ జిల్లా పళని పట్టణంలోని లక్ష్మి నగర్‌లో గాంధీ (39) అనే మహిళ ఓ లాడ్జిలో పనిచేస్తున్నారు. ఆమెను ఈ నెల 11వ తేదీన కొందరు దుండగులు హత్య చేసి పారిపోయారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా పళని సమీపంలోని బాలసముద్రానికి చెందిన ఆనంద్‌కుమార్ (42) అనే వ్యక్తిని నిందితుడుగా గుర్తించి అరెస్టు చేశారు. ఈయన పళని అడివారంలో ఉన్న ఒక స్వామి దగ్గర శిష్యుడిగా ఉన్నట్టు గుర్తించారు.

ట్రిప్లికేన్ సీఐకి సీపీ అభినందనలు

● ఆటో డ్రైవర్‌కు బహుమతి

అడయార్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో అరెస్టయిన నిందితుడికి త్వరితగతిన శిక్షపడేలా చర్యలు తీసుకున్న ట్రిప్లికేన్ ఆల్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్ సీఐ మహాలక్ష్మిని పోలీస్ కమిషనర్ అరుణ్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం ఆమెను కమిషనరేట్‌కు ఆహ్వానించి అభినందించారు. అలాగే, ఒక ప్రయాణికుడు ఆటోలో మరచిపోయిన రూ.40 వేలు పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఆటోడ్రైవర్‌కు కూడా సీబీ బహుమతి అందజేశారు. 2020లో ట్రిప్లికేన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై జరిగిన అత్యాచార కేసులో నిందితుడికి ఐదేళ్ళ జైలుశిక్షతో పాటు రూ.5 వేల అపరాధాన్ని కోర్టు విధించింది. ఈ కేసులో సాక్ష్యాధారాలను సేకరించి నిందితుడుకి త్వరితగతిన శిక్ష పడేలా ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అలాగే, ముగప్పేర్ ఈస్ట్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ శరవణన్ తన ఆటోలో ప్రయాణికులు మరిచిపోయిన రూ.40 వేల నగదు బ్యాగును అన్నా నగర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఆటో డ్రైవర్‌ను కూడా సీపీ అరుణ్ కమిషనరేట్‌కు ఆహ్వానించి అభినందించి బహుమతి అందజేశారు.

జౌళి దుకాణంలో రూ.9 లక్షల చోరీ

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని ప్రముఖ జౌళి దుకాణంలో రూ.9 లక్షలు చోరీ చేసిన ఘటనపై మాంబళం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రాంతంలోని కుమరన్ సిల్క్స్‌లో 4వ అంతస్తులో ఏసీ మెషీన్ పైకప్పు తొలగించిన లోనికి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులు రూ.9 లక్షలు చోరీ చేసి పరారయ్యారు. ఈ విషయం గుర్తించిన దుకాణ సిబ్బంది ఫిర్యాదు మేరకు మాంబళం పోలీసులు విచారణ చేపట్టారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలో ఇద్దరు వ్యక్తులు దోపిడీకి పాల్పడడం గుర్తించి, అగంతకులకు పట్టుకొనేందుకు మూడు ప్రత్యేక బృందాలు నియమించారు.

ఆస్పత్రి నుంచి జీవిత ఖైదీ పరార్

వేలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడుక్కంపారై ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న యావజ్జీవ ఖైదీ తప్పించుకుపోయిన ఘటన కలకలం రేపింది. కాట్పాడి సమీపంలో 2021లో జరిగిన హత్యకేసులో కేరళకు చెందిన బాబు షేక్‌కు న్యాయస్థానం యావజ్జీవ శిక్ష విధించడంతో వేలూరు జైలులో ఉన్నాడు. అతను అనారోగ్యానికి గురికావడంతో ఈ నెల 15న ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తప్పించుకు పారిపోయాడు. అతడి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

తమిళ చిత్రజ్యోతి

ప్రతి సినిమా ఒక పాఠంలా ఉండాలి


ట్రైలర్ రిలీజ్ వేడుకలో చిత్ర బృందం

● దర్శకుడు ఎస్ఏసీ

ప్రతి సినిమా ఒక పాఠంలా ఉండాలని సీనియర్ దర్శకనటుడు ఎస్.ఏ.చంద్రశేఖర్ (ఎస్ఏసీ) అన్నారు. తాను దర్శకత్వం వహించిన తొలి చిత్రం నుంచి ఇప్పటివరకు రూపొందించిన ప్రతి సినిమాలో ఏదో ఒక సందేశం ఉందని ఆయన గుర్తుచేశారు. డెబ్యూ డైరెక్టర్ నితిన్ వేంబుపతి దర్శకత్వంలో ఎస్ఏ.చంద్రశేఖర్, వైజీ మహేంద్రన్, సత్యన్, బాలాజీ శక్తివేల్, జార్జ్ మరియన్, ఇంద్రజ, రోబో శంకర్ తదితరులు నటించిన చిత్రం 'కూరన్'. వీపీ కంబైన్స్ పతాకం సహకారంతో కనా ప్రొడక్షన్స్ పతాకంపై దర్శకుడు విక్కీ నిర్మించారు. ఓ శునకానికి ఉన్న చట్టపరమైన హక్కుల చుట్టూ స్క్రీన్‌ప్లే సాగుతుంది. జంతు హక్కుల సమస్యలను ప్రధానంగా ప్రస్తావించేలా రూపొందించారు. ఈ చిత్ర ట్రైలర్ సోమవారం విడుదల చేశారు. ఇందులో పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ '45 యేళ్ళ సినీ కెరీర్‌లో అనేక చిత్రాలను నిర్మించాను. ప్రతి సినిమా తీసే వారు ఇది ఒక వైవిధ్యభరితమైన చిత్రం, చాలా మంచి చిత్రమని ప్రతి ఒక్కరూ చెప్పేమాట. కానీ, నా సినీ కెరీర్‌లో తొలిసారి నిజంగానే ఇది వైవిధ్యభరితమైన చిత్రం. హీరో లేడు, హీరోయిన్ లేదు, పాటలు లేవు, డ్యాన్స్ లేదు. రక్తపాతం అంతకంటే లేదు. కానీ, కేవలం ఒక్క శునకమే ప్రధాన పాత్ర పోషించింది. ఆ శునకం పేరు 'భైరవ'. నేను దర్శకత్వం వహించిన ప్రతి ఒక్క చిత్రంలోనూ ఏదో ఒక సందేశం చెప్పాను. తొలిసారి ఏ పాపం తెలియని శునకం కోసం న్యాయపోరాటం చేసేందుకు కోర్టు మెట్లు ఎక్కాను. ఒక ఎమోషనల్‌తో మంచి సందేశాత్మక చిత్రం. ఈ చిత్రం సక్సెస్ సాధిస్తే అనేక మందికి లైఫ్ వస్తుంది. ఇలాంటి సినిమాను మీడియానే ఆదరించాలి. ఈ సినిమా చూసిన తర్వాత మీకు నచ్చితే ఖచ్చితంగా మీరే ప్రమోట్ చేసి చిత్రాన్ని సక్సెస్ చేయాలని కోరుతున్నాను. ఇందులో నటించిన నటులంతా కొత్తవారే. ఈ సినిమా హిట్ అయితే, ఇండస్ట్రీకి అనేక మంది కొత్తవారికి లైఫ్ దొరుకుతుంది' అని పేర్కొన్నారు. ఆ తర్వాత చిత్ర బృందం సభ్యులంతా ప్రసంగించారు. చిత్రాన్ని ఈ నెల 28వ తేదీన విడుదల చేస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లో మంచినే స్వీకరించాలి

● విజయ్ సేతుపతి



నేటి యువతతో పాటు విద్యార్థినీ విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం చాలా ఎక్కువగా ఉందని, సోషల్ మీడియా నుంచి కేవలం మంచిని మాత్రమే స్వీకరించాలని ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి విద్యార్థులకు సూచించారు. పాండిరాజ్ దర్శకత్వంలో తాను నటిస్తున్న కొత్త చిత్రం చిత్రీకరణ పెరంబలూరు పరిసర ప్రాంతాల్లో జరుగుతుంది. ఈ నేపథ్యంలో పెరంబలూరులో ఓ కాలేజీ వేడుకల్లో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 'ప్రతి క్షణాన్ని ఆస్వాదించండి. సంతోషంగా ఉండండి. సోషల్ మీడియాను నిత్యం అనుసరించండి. అది తప్పుకాదు. కానీ, అందులో ఏది మంచో, ఏది చెడో గ్రహించి మంచిని మాత్రమే స్వీకరించండి. సమయం అద్భుతమైనది. చాలా చిన్నది కూడా. కాలం ఎంత ముఖ్యమో అది గడిచిపోయిన తర్వాతే తెలుస్తుంది. జీవితం ప్రతి ఒక్కరికీ ఒక వరం. నా జీవితంలో ఏదీ కూడా పక్కా ప్లాన్‌తో జరగలేదు. అగ్రహీరో అజిత్‌తో సమయం వచ్చినపుడు నటిస్తాను. ఆయన ఒక గొప్ప నటుడు, అంతకుమించి మంచి మనిషి' అని అన్నారు.

శివకార్తికేయన్ రజని మురుగన్ రీ రిలీజ్


శివకార్తికేయన్‌కు బర్త్‌డే విషెస్ చెబుతున్న నిర్మాత ఎన్వీ ప్రసాద్

శివకార్తికేయన్ హీరోగా నటించిన 'రజని మురుగన్' చిత్రాన్ని వచ్చే నెలలో రీ రిలీజ్ చేయనున్నట్టు నిర్మాణ సంస్థ ప్రకటించింది. 2016లో సంక్రాంతికి విడుదలై ఘనవిజయం సాధించి శివకార్తికేయన్ సినీ కెరీర్‌ను మలుపుతిప్పిన మూవీ. చిత్రంలో కామెడీ సన్నివేశాలు, పాటలు, కథనం ఇలా ప్రతి ఒక్క అంశాన్ని ప్రేక్షకులు ఎంతో ఎంజాయ్ చేస్తూ వీక్షించారు. అయితే, ప్రస్తుతం అనేక పాత చిత్రాలను రీరిలీజ్ చేస్తుంటే, వాటికి కూడా ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. వాటిలో విజయ్ చిత్రాలు అధికంగా రీరిలీజ్ చేస్తున్నారు. 'గిల్లీ' మూవీ రీరిలీజ్‌లోనూ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. దీంతో 'రజిని మురుగన్' మళ్ళీ రిలీజ్ చేయాలని తిరుపతి బ్రదర్స్ నిర్ణయించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో అధికారికంగా ప్రకటించారు. తిరుపతి బ్రదర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి పొన్‌రామ్ దర్శకుడు. శివకార్తికేయన్, రాజ్‌కిరణ్, కీర్తి సురేష్, సూరి, సముద్రఖని తదితరులు నటించారు. ఇదిలావుంటే, శివకార్తికేయన్ తన పుట్టిన రోజు వేడుకలను సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు సినీ ప్రముఖులు బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపారు.

యువ దర్శకులకు అవకాశం ఇస్తున్న ధనుష్


ధనుష్, అనిరుధ్, తమిళరసన్

హీరో ధనుష్ వరుసగా యంగ్ దర్శకులకు అవకాశం ఇస్తున్నారు. ప్రస్తుతం 'ఇడ్లీకడై' పేరుతో ఓ చిత్రంలో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తర్వాత యువ దర్శకులకు ఆయన వరుసగా అవకాశం ఇస్తున్నారు. 'పోర్‌తొళిల్' దర్శకుడు విఘ్నేష్ రాజా దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించనున్నారు. ఇపుడు మరో యంగ్ దర్శకుడుకి అవకాశం ఇచ్చారు. 'లబ్బర్ పందు' సినిమా దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు డైరెక్షన్‌లో నటించేందుకు అంగీకరించారు. అయితే, ఈ ప్రాజెక్టుపై అధికారపూర్వకంగా ప్రకటించాల్సి వుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సంగీత స్వరాలను అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందించనున్నారు.

మే 3 నుంచి అంతర్జాతీయ శైవసిద్ధాంత మహానాడు

● ధర్మపురం ఆధీన మహాసన్నిధానం ప్రకటన


మైలాడుదురైలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాసిలామణి దేశిక జ్ఞానసంబంధ పరమాచార్య స్వామి

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో మే 3న అంతర్జాతీయ శైవ సిద్ధాంత మహానాడు నిర్వహించనున్నట్లు మైలాడుదురై 27వ ధర్మపురం ఆధీన గురుమహాసన్నిధానం మాసిలామణి దేశిక జ్ఞానసంబంధ పరమాచార్య స్వామి ప్రకటించారు. సోమవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1984లో తొలిసారిగా అంతర్జాతీయ శైవసిద్ధాంత పరిశోధనా సంస్థ నెలకొల్పామని, ఆ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ధర్మపురం, మలేసియా, వారణాసి, మదురై చెన్నై నగరాల్లో మహానాడు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా చెన్నై నుంచి కన్నియాకుమారి వరకు తమ ఆధీనం (మఠం) ఆధ్వర్యంలో శైవసిద్ధాంత కళాశాలల ద్వారా ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 27వ గురుమహా సన్నిధానం కయిలై నక్షత్ర గురుమణిగళ్, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో 6వ అంతర్జాతీయ శైవసిద్ధాంత మహానాడు జరుపనున్నామని వెల్లడించారు. కాట్టాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మే 3 నుంచి 5 వరకు ఈ మహానాడు జరుగుతుందన్నారు. సంగ సాహిత్యం నుంచి వర్తమాన సాహిత్యం వరకు సిద్ధాంతాలపై సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ మహానాడులో శైవాధీనాల గురుమహాసన్నిధానాలు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, దేశవిదేశాలకు చెందిన మంత్రులు, శివాచార్యులు, విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, ఆలయాల ట్రస్టీలు పాల్గొంటారని ఆయన వివరించారు.


బ్రిడ్జి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో ముగిసిన బ్రిడ్జి టోర్నమెంట్

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో ఈ నెల తొమ్మిదిన ప్రారంభమైన నేషనల్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయని ఎక్స్‌ప్రెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజింగ్ డైరెక్టర్ కవితా సింఘానియా తెలిపారు. బ్రిడ్జ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తమిళనాడు బ్రిడ్జి అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయని, బ్రిడ్జి టోర్నమెంట్‌ను భారతీయ బ్రిడ్జి చరిత్రలోనే తొలిసారిగా మాల్ (ఎక్స్‌ప్రెస్ అవెన్యూ)లో నిర్వహించిన ఘనత తమకే దక్కిందన్నారు. బ్రిడ్జి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రసాద్ కేని, వరల్డ్ బ్రిడ్జ్ ఫెడరేషన్ కమిటీ సభ్యుడు ఎన్ఆర్.కృపాకర్ మూర్తి, ఎక్స్‌ప్రెస్ అవెన్యూ బ్రిడ్జి ఈవెంట్ ఆర్గనైజర్ నారాయణ్ అయ్యాన్, తమిళనాడు బ్రిడ్జి అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.5లక్షల వరకు నగదు బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వ్యాయామంపై అవగాహన కోసం మారథాన్

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వ్యాయామం ప్రాముఖ్యత తెలియజేసేలా కన్నియాకుమారి గాంధీ మండపం నుంచి చెన్నై వరకు ఆరుగురు చిన్నారులు ఆదివారం మారథాన్ ప్రారంభించారు. 13 రోజుల్లో చెన్నై వరకు సుమారు 700 కి.మీ మేర మారథాన్ సాగనుంది. శివగంగ, రామనాథపురం జిల్లాలకు చెందిన ప్రదీప్, ప్రణీష్, కనీస్, శివశాస్త్రా, బౌదిన్ శివ, కార్తీక్ తదితర విద్యార్థులు చోళన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఈ మారథాన్‌లో పాల్గొంటున్నారు. ప్రపంచ శాంతి, మహిళలు, చిన్నారుల భద్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యాయామం ప్రాధాన్యత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ మారథాన్ చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.


కన్నియాకుమారి నుంచి బయల్దేరిన చిన్నారులు

ఆలయాలకు మహర్దశ

● రూ.50.79 కోట్లతో పూర్తయిన 15 పథకాలు
● ప్రారంభించిన సీఎం స్టాలిన్
● తిరుచెందూరులో క్యూలైన్ కాంప్లెక్స్


సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేవాదాయ శాఖ పథకాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏడు జిల్లాల్లో రూ.50.79 కోట్లతో పూర్తయిన 15 పథకాలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ఉదయం సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో రూ.20.50 కోట్లతో నిర్మించిన క్యూ కాంప్లెక్స్ పరిపాలనా భవనం, హాలు ప్రారంభించారు. ఇదే విధంగా చెన్నై మింట్ ప్రాంతంలోని ఏకాంబరేశ్వర ఆలయంలో అర్చకులు, సిబ్బందికోసం రూ.6.75 కోట్లతో నిర్మించిన క్వార్టర్స్‌తో పాటు పలు ఆలయాల్లో పూర్తయిన పథకాలు ప్రారంభించారు.

అదే విధంగా ఆ శాఖ ఆధ్వర్యంలో వివిధ ఆలయాల్లో రూ.121.43 కోట్ల వ్యయంతో చేపట్టనున్న కొత్త పథకాలకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పర్యాటక దేవాదాయ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పి.ఎన్ శ్రీధర్, అదనపు కమిషనర్ డాక్టర్ సి. పళని, చీఫ్ ఇంజనీర్ పి. పెరియసామి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రారంభం...

వాణిజ్యపన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మరొక కార్యక్రమంలో సేలం జిల్లాల్లో కొత్తగా నిర్మించిన కాడయాంబట్టి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి, కృష్ణగిరి జిల్లా బాగలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సీఎం స్టాలిన్ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి.మూర్తి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, వాణిజ్యపన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్ జయంత్, రిజిస్ట్రేషన్ శాఖ అధ్యక్షుడు దినేష్ పొన్‌రాజ్ ఆలీవర్ తదితరులు పాల్గొన్నారు.


ఒప్పంద కార్యక్రమంలో ఇరువర్గాల ప్రతినిధులు

శంకర నేత్రాలయతో ఆర్ఈసీ ఫౌండేషన్ ఒప్పందం

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్ఈసీ ఫౌండేషన్ పమ్మల్‌లోని శంకర కంటి ఆస్పత్రితో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 12 నెలల కాలంలో 8 వేల కంటి శుక్లం శస్త్రచికిత్సలు నిర్వహించాల్సివుండగా, దీని కోసం ఆర్ఈసీ ఫౌండేషన్ రూ.6 కోట్లు సమకూర్చాల్సివుంటుంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఆర్ఈసీ డైరెక్టర్ నారాయణన్ తిరుపతి, ప్రోగ్రామ్ మేనేజర్ తారా రమేష్, శంకర నేత్రాలయ ఈడీ పమ్మల్ విజీ కమాండ్ వి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవితమే ముక్తికి మార్గం

● మాతా అమృతానందమయి


అనుగ్రహ భాషణం చేస్తున్న అమృతానందమయి

ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక జీవితమే ముక్తికి మార్గమనే విషయం గ్రహించాలని మాతా అమృతానందమయి హితవు పలికారు. నగరంలో సోమవారం నిర్వహించిన బ్రహ్మస్థాన మహోత్సవంలో పాల్గొన్న ఆమె అనుగ్రహ భాషణం చేశారు. కొవిడ్ అనంతరం రాజధాని నగరం చెన్నైలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరు ప్రేమ, అనురాగం, దయ, ఆప్యాయతలతో జీవించాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరు ప్రకృతిని ఆరాధించాలని సూచించారు. మానవులు పక్షిలా ఎగిరేందుకు, చేపలా ఈదేందుకు నేర్చుకున్నారని అయితే, జీవిత విలువలను గుర్తించకుండా తాబేలులా పాకుతూ జీవనం సాగిస్తున్నారని, ఈ విధానంలో మార్పు రావాలన్నదే భగవంతుని కోరికగా మీ ముందుంచుతున్నానని అమృతానందమయి భక్తులకు సూచించారు.



సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాడయాంబట్టి, బాగలూరులో కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్


వైద్యశాస్త్రాల జాతీయ పరీక్షల సంస్థ నిర్వహించిన సూపర్ స్పెషాలిటీపరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలై స్వర్ణపతకాన్ని గెలుచుకున్న డాక్టర్ ఎం.శుభశ్రీ, ఆమె తల్లిదండ్రులు సచివాలయంలో ముఖ్యమంత్రిని సోమవారం మర్యాదపూర్వకంగా కలవగా, శుభశ్రీని అభినందిస్తున్న సీఎం స్టాలిన్

తాడికొంబు పెరుమాళ్ ఆలయంలో అద్దాల గది ప్రారంభం


అద్దాల గదిలో ఉత్సవమూర్తులు

పెరంబూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):దిండుగల్ తాడికొంబు సౌందరరాజ పెరుమాళ్ ఆలయంలో రూ.7 లక్షలతో ఏర్పాటుచేసిన అద్దాల గదిలో ఉత్సవమూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ విషయమై ధర్మకర్తల మండలి చైర్మన్ విఘ్నేష్ బాలాజీ మాట్లాడుతూ... తిరుపతి, శ్రీరంగం, శ్రీ విల్లిపుత్తూర్ తర్వాత తాడికొంబు సౌందరరాజ పెరుమాళ్ ఆలయంలో అద్దాల గది ఏర్పాటుచేశామన్నారు. పండుగలు, విశేష రోజులు, ఉత్సవాల సమయంలో ఉత్సవమూర్తులు అద్దాల గదిలో ఉంటూ భక్తులకు దర్శనమిస్తారని ఆయన తెలిపారు.

ఫ్లవర్‌షోకు ఏర్కాడు సిద్ధం



చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరుగాంచిన ఏర్కాడు మే నెలలో జరుగనున్న ఫ్లవర్‌షోకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ఉద్యానవనాల శాఖ ఉన్నతాధికారులు గత రెండు నెలలుగా ఏర్కాడు అంతటా వివిధ రకాల పూల మొక్కలను పెంచడంపై దృష్టిసారించారు. ఏర్కాడులో ఈ యేడాది రుతపవన ప్రభావిత వర్షాలు సక్రమంగా కురవటంతో అన్ని ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొందని అధికారులు చెబుతున్నారు. ప్రతియేటా ఈ ప్రాంతంలో ఫ్లవర్ షో నిర్వహిస్తుంటారు, ఆ పుష్ప ప్రదర్శనను దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునే రీతిలో నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే బోటానికల్ గార్డెన్ ప్రాంతంలో డేలియా, పాల్సమ్, జీనియా, సాల్వియా, డెల్ఫీనియం, ఆస్టర్, మేరీగోల్డ్ తదితర రకాల పూల మొక్కలను పెంచుతున్నామని, ఆ మొక్కలకు ప్రస్తుతం పూలు వికసిస్తున్నాయని చెప్పారు. 'ఏర్కాడు రోస్' అని పిలిచే టేడియా కటింగ్స్ గులాబీ పూల మొక్కలు మిట్ట ప్రాంతాల్లో ఏపుగా పెరుగుతున్నాయని చెప్పారు.

తిరుప్పరంగుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించాలి

● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్



ప్యారీస్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుప్పరంగుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించేందుకు దేవాదాయ శాఖ తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ఉదయం నగరం నుంచి మదురై చేరుకొని మీనాక్షి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి తిరుప్పరంగుండ్రం సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లారు. ఆయనకు ఆలయం వద్ద పూర్ణకుంభ స్వాగతం లభించింది. స్వామివారి దర్శనానంతరం కేంద్ర మంత్రి మురుగన్ మీడియాతో మాట్లాడుతూ... 2021వ సంవత్సరం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన వెట్రివేల్ యాత్రకు తాను సారథ్యం వహించానని, ఆ సమయంలో సుబ్రమణ్యస్వామి కొలువుదీరిన ఆరు ప్రధాన క్షేత్రాలు సందర్శించే భాగ్యం కలిగిందన్నారు. ప్రధాన క్షేత్రమైన తిరుప్పరంగుండ్రం కొండపై ఉన్న కాశీ విశ్వనాథుడి దర్శనం చేసుకొని మొక్కు చెల్లించినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో కొన్ని హిందూ సంస్థలు తిరుప్పరంగుండ్రం కొండపై హిందువులకు వ్యతిరేకంగా జరిగే సంఘటనలను ఖండిస్తూ ఆందోళన చేపట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. మాతృభాషను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతోనే కేంద్రం జాతీయ విద్యా విధానాన్ని ప్రకటించిందన్నారు. పిల్లలు ప్రాథమిక విద్య మాతృభాషలో మాత్రమే చదువుకొంటే వారి భవిష్యత్తు చక్కగా ఉంటుందని, అయితే కొంతమంది దీనికి వ్యతిరేకమంటూ కపట నాటకం ఆడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు.

20 నుంచి వీఐటీలో రివేరా కల్చరల్ ఫెస్ట్


లోగో ఆవిష్కరిస్తున్న వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ యూనివర్సిటీలో ఈ నెల 20 నుంచి 23వ తేది వరకు 'రివేరా కల్చరల్ ఫెస్ట్' జరుగనుంది. వర్శిటీ ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఛాన్సలర్ విశ్వనాథన్ ఫెస్టివల్‌కు సంబంధించిన లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ మాట్లాడుతూ... తమ వర్సిటీ ఆధ్వర్యంలో 23వ వార్షిక రివేరా కల్చరల్ ఫెస్ట్ నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నామన్నారు. ఈ ఫెస్ట్‌ను బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి అనితా పాల్‌దురై ప్రారంభిస్తారని, ముగింపు వేడుకలకు బాలీవుడ్ నటుడు సోనుసూద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ ఫెస్ట్‌లో భారత్, నేపాల్, మలేసియా, థాయ్‌లండ్, రుమేనియా సహా 25 దేశాలకు చెందిన ప్రముఖ వర్సిటీల నుంచి సుమారు 45వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. 20న అంద విద్యార్థులకు వివిధ పోటీలు, 21వ తేది ఉదయం 9 గంటలకు 'ఐకియా' పేరుతో వివిధ రాష్ట్రాల విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజమోహన్, అరుణ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. రూ.5.5 కోట్లతో నిర్వహిస్తున్న ఈ ఫెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు సుమారు రూ.25 లక్షల విలువైన బహుమతులు అందజేయనున్నట్లు ఛాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు. కార్యక్రమంలో వర్శిటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, డైరెక్టర్ సంధ్య పెండారెడ్డి, కో-ఆర్డినేటర్ గోకుల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేఎల్ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్ సిల్వర్‌జూబ్లీ


జ్యోతిప్రజ్వలన చేసి ఉద్యోగుల సదస్సును ప్రారంభిస్తున్న చైర్మన్ టీపీ శ్రీనివాసన్

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఫైనాన్స్, బంగారు నగలపై రుణాలిచ్చే కేఎల్ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా '25వ ఉద్యోగుల మహానాడు' అట్టహసంగా నిర్వహించింది. సంస్థ చైర్మన్, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి టీపీ శ్రీనివాసన్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ మహానాడు ప్రారంభించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శిబుతెక్కుంపురం, సీఈఓ నోజ్‌రవి, రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ మహానాడులో ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు.

మహారాష్ట్ర సీఎంను కలిసిన టీటీడీ ఈవో



శ్రీవారి దర్శనం కోసం వచ్చిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను సోమవారం టీటీడీ ఈవో శ్యామలరావు తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నవీ ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణంపై దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చించారు. ఆలయ నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయి త్వరతగతిన నిర్మాణం జరిగేందుకు సహకరించాలని ఈవో కోరగా, మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సౌరభ్ హెచ్‌బోరా పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి


ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.20 లక్షలు విరాళంగా అందాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన వెంకటరమణ రూ.10 లక్షలు, తిరుపతికి చెందిన సాధు పృథ్వీ రూ.10 లక్షలు చొప్పున విరాళం డీడీలను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.



అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న సాధు పృథ్వీ

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,203

తలనీలాలు సమర్పించినవారు: 21,793



మన శివాలయాలు

ఇక్కడ అడుగు పెట్టగానే కాశీ విశ్వేశ్వరుడే కాదు సకల దేవతామూర్తులూ దర్శనమిస్తారు. అందుకే దక్షిణ కాశీగా భక్తుల మనసులో ఆధ్యాత్మిక ముద్ర వేసుకుంది.. నగరి మండలం బుగ్గఅగ్రహారంలోని అన్నపూర్ణసమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం శతాబ్దాలుగా ఇతిహాస,చరిత్రలకు సాక్షిగా నిలుస్తోంది. ఈ దివ్యధామం గురించి తెలుసుకుంటే...

- నగరి, ఆంధ్రజ్యోతి

బుగ్గ అగ్రహారం భూకైలాసం

కొలువు దీరిన కాశీ విశ్వేశ్వరుడు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ గోపురం - దోనె నుంచి తీర్థం నీరు

సప్త రుషుల్లో ఒకరైన గౌతమి మహర్షి దేశసంచారంలో భాగంగా బుగ్గ అగ్రహారం వద్ద సేదతీరారని ఇతిహాసగాథ ప్రచారంలో ఉంది. గంగా తీరాన కాశీఆలయం తరహాలోనే ఇక్కడి కుశస్థలీ నది ఒడ్డున వాతావరణం పోలి ఉన్నట్టు ఆయన గుర్తించారు.



ఆలయ ముఖద్వారం

దక్షిణభాగంలోనూ ఇది కాశీగా భాసిల్లుతుందని భావిచారట. పాండవులు వనవాస సమయాన ఈ ప్రాంతంలో సంచరించి కాశీని తలపించే దేవతా విగ్రహాలు ఇక్కడ ఉండటాన్ని గమనించారని చెబుతారు. ఆక్రమంలోనే నీటి కోసం కాశీ, గుహ, భవాని, పుణికర్ణిక, అయ్యవున అనే దోనెలను సృష్టించారంటారు. శివభక్తులైన చోళరాజులు ఇక్కడి విశిష్టత గుర్తించి క్రీ.శ. 1562లో అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు ప్రస్తుత ఆలయ ప్రధానార్చకుడు కుప్పయ్యస్వామి తెలిపారు.

ఆలయాల ఆధ్యాత్మిక మాల

బుగ్గ దేవాలయ ప్రాంగణంలో సకల దేవతల ఆలయాలూ ఉన్నాయి. విశ్వేశ్వరుడు, కామాక్షిదేవి, అన్నపూర్ణదేవి, భూనీలాదేవి సమేత ప్రయాగ మాధవస్వామి, కాలభైరవస్వామి, దొంటిగణపతి, సద్యోజాత మూర్తి, వాసుదేవమూర్తి, అఘోర మూర్తి, వల్లిదేవయాని సమేత సుబ్రమణ్యస్వామి, భక్తకన్నప్ప, దుర్గాదేవి, తత్పురుష మూర్తి, వీరభద్రస్వామి, మహిషాసురమర్దిని, సూర్యనారాయణస్వామి, భక్తాంజనేయస్వామిలు భక్తుల నుంచి పూజలందుకుంటున్నారు.

30ఏళ్లుగా టీటీడీ నిర్వహణ



ఆలయ ప్రాంగణంలో చిన్న దేవాలయాలు

చోళరాజులు, కార్వేటినగరం రాజుల తర్వాత తిరుపతి ఆలయ మహంతులు ఈ ఆలయాన్ని పర్యవేక్షించారు. 1980లో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 1994 నుంచి నిర్వహణ బాధ్యతను తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకుంది. శివుడితోపాటు పలు దేవుళ్ల విగ్రహాలు ఉండటంతో శివరాత్రి మాత్రమే కాదు ఏటా ఏకాదశి, వినాయకచవితి, ఆడికృత్తిక, సంక్రాంతి, విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అయితే వేసవి తీవ్రత నేపథ్యంలో గతేడాది అక్టోబరులో నవరాత్రి ఉత్సవాలలో రెండు దోనెల్లో మాత్రమే నీరు ప్రవహించిది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఈ నీటితో స్నానమాచరించారు. ఈఏడాది శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రివరకూ ప్రసాద వితరణ ఉంటుందని అర్చకులు తెలిపారు.







డ్రోన్‌ల నుంచి కీచైన్‌ల దాకా..

● ఆకట్టుకుంటున్న టెంపుల్ ఎక్స్‌పో


తిరుపతిలో సోమవారం మొదలైన మూడురోజుల ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-2025 (ఐటీసీఎక్స్)లో ఏర్పాటుచేసిన పలు రకాల స్టాల్స్ ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యద్వారా వద్ద బంగారుపూతతో మినీ ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఆలయాల నిర్వహణలో ఉపకరించే ఆధునిక పరికరాలు, భద్రతకు ఉపయోగపడే ఎలక్ట్రానిక్ పరికరాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయి. భారతీయ సంప్రదాయ చేనేత వస్త్రాలు, జానపద సంప్రదాయ చిత్రాలు కూడా ఉఆన్నయి. డ్రోన్‌లు, ఫ్లయింగ్ కెమెరాలు, సీసీ కెమెరాలు, టూవీలర్లూ, కార్లకు క్విక్ చార్జింగ్ యంత్రాలు, మూవింగ్ ఎల్ఈడీ స్క్రీన్స్ ఈ ప్రదర్శనలో ఆకర్షిస్తున్నాయి.

మిరుమిట్లు గొలిపే కలర్‌ఫుల్ ఎల్ఈడీ లైట్లు, డిజిటల్ లాకర్స్ మొదలు ఆటోమేటిక్ క్లీనింగ్ యంత్రాల దాకా ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి.

- తిరుపతి అర్బన్,ఆంధ్రజ్యోతి











పీజీఆర్ఎస్‌కు 238 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 238 వినతులు వచ్చాయి. అందులో ప్రధానంగా భూసమస్యలపై 161 అర్జీలు ఉన్నాయి. జిల్లాలోని పలు మండలాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు వినతులు స్వీకరించారు.

పింఛన్ ఇప్పించండి మహాప్రభో..!



అగ్ని ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితికి చేరుకున్నాను. ఎన్నో ఏళ్లుగా వస్తున్న పింఛన్‌ను రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం నిలిపివేసింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా. కరుణించి పింఛను పునరుద్ధరించండి.

- గురుస్వామి, దివ్యాంగుడు, జీవకోన

గ్రామానికి రోడ్డు వేయండి

30 ఏళ్లుగా గ్రామానికి రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని, కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా లాభం లేకపోయిందని వడమాలపేట మండలం వడమాల దళితవాడ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. వెంటనే రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించారు.



రోడ్డు కోసం ఆందోళన చేస్తున్న వడమాల దళితవాడవాసులు

తిరుమలలో వేసవి ఉపశమన చర్యలు



వేసవి రాకముందే తిరుమలలో ఎండ మండుతోంది. వారం రోజులుగా చెప్పులు లేకుండా నడవటం ఇబ్బందిగా మారింది. పరిస్థితిని గుర్తించిన టీటీడీ అధికారులు తక్షణ చర్యలను ప్రారంభించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటితో నేల భాగాన్ని చల్లబరుస్తున్నారు. రానున్న వారం రోజుల్లో పలు ప్రదేశాల్లో చలువ పందిళ్ల వేయనున్నారు. అవసరమైన చోట కూల్ పెయింట్ వేయాలని ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై అవగాహన

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సొంతంగా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ చేపట్టనుండడంతో సోమవారం అధికార యంత్రాంగానికి అవగాహన కల్పించారు. అలిపిరి డిపో కార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన వీఎన్ఆర్ అండ్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ అండ్ రీసెర్చ్ ప్రతినిధి అస్లామ్ అన్సారి, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్లు అంజర్‌ఖార్, రమేష్, హరీష్ హాజరై విద్యుత్ బస్సుల వినియోగంతో కలిగే ప్రయోజనాలు, అనుకూలతలు, మెరుగైన నిర్వహణ వంటి అంశాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒకే దఫాలో రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు తెలుస్తోంది. ఈ సదస్సులో డీపీటీవో జి.నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఎంలు బాలాజీ, హరిబాబు, భాస్కర్, పుష్పలత, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్వీయూను సందర్శించిన యూఎస్ఏ ప్రతినిధి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన ఫార్డ్యూ యూనివర్సిటీ ప్రతినిధి జూలియానా కస్సవన్ సోమవారం ఎస్వీ యూనివర్సిటీని సందర్శించారు. గతంలో ఎస్వీయూతో ఫార్డ్యూ వర్సిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఈ రెండు వర్సిటీలు పరస్పరం సహకరించుకోనున్నాయి. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాన్ని సందర్శించిన జూలియానా కస్సవన్‌ను ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాద రాజు సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు విజయలక్ష్మి, అపర్ణ, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.



జూలియానా కస్సవన్‌ను సత్కరిస్తున్న దేవప్రసాదరాజు

టీటీడీ చైర్మన్ ఫొటో డీపీగా పెట్టుకుని..

● ఎన్ఆర్ఐలను మోసగిస్తున్న కేటుగాడు



తిరుమల సమాచారంతో పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి ఫొటోను వాట్సాప్ ప్రొఫైల్ ఫొటోగా పెట్టుకుని ఎన్ఆర్ఐ భక్తులను మోసగిస్తున్న ఘటన సోమవారం వెలుగుచూసింది. మోసపోయిన కొందరు భక్తులు ఇటీవల టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెల్లడైంది. హైదరాబాద్‌లోని ఓల్డ్‌సిటీకి చెందిన మహ్మద్ జావెద్ ఖాన్ 'తిరుమల సమాచారం' పేరుతో ఓ వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని గ్రూప్‌లో పోస్ట్ చేస్తూ అందిన వరకు దోచుకుంటున్నాడని విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని టీటీడీ విజిలెన్స్, పోలీసులను చైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్, - కాశీ మఠాధిపతి సమ్యమేంద్రతీర్థ.



మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి - ఇండియన్ నేవీ మాజీ అధికారి హరి ఓం సింగ్ రాణా - యాంకర్ గీతా భారతి

సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం

● మోపూరు అటవీ భూముల్లో 144, 145 సెక్షన్లు ● ఆక్రమణదారులు రాకుండా పోలీసుల పహారా

డక్కిలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని మోపూరు సర్వే నెంబరు 1లో ఉన్న అటవీశాఖ భూమి సెంటు కూడా అన్యాక్రాంతం కానివ్వబోమని వెంకటగిరి రేంజ్ ఆఫీసర్ లోకేశ్ స్పష్టం చేశారు. సోమవారం అటవీ భూముల ఆక్రమణ జరుగుతుందని సమాచారం అందడంతో ఆ శాఖ అధికారులతో పాటు పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. సదరు భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించరాదంటూ పోలీసులు 144 సెక్షన్, అటవీశాఖ అధికారులు 145 సెక్షన్ విధించారు. ఈ సందర్భంగా రేంజర్ లోకేశ్ మాట్లాడుతూ గిరిజన సంఘ నాయకులు కొంతమంది స్థానికులను రెచ్చగొట్టి అటవీ భూముల ఆక్రమణను ప్రోత్సహించడం సరికాదన్నారు. రిజర్వు ఫారెస్టు భూములను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని గుర్తుచేశారు. కొంతమంది అటవీ భూమును తాము సాగు చేస్తున్నట్లు హైకోర్టును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. 145 సెక్షన్ మూడు నెలలు పాటు అమల్లో ఉంటుందన్నారు. మోపూరు భూములను గూడూరు డీఎస్పీ గీతా కుమారి పరిశీలించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని చర్యలు తీసుకోవాలని వెంకటగిరి సీఐ వెంకటరమణకు తగు సూచనలు ఇచ్చారు.



మోపూరు భూముల్లో అటవీశాఖ, పోలీసు అధికారులు